# బయట అమావాస్య లోపల పౌర్ణమి

కథ

—డాక్టర్ చల్లా రాధాకృష్ణశర్మ

బస్సు దిగడం తరువాయి, భానుమూర్తి సరాసరి ఇంటికి దారి తీశాడు. పక్కనున్న స్నేహితుడు, 'ఎందుకోయ్ అంత తొందర?' అంటూ ఉన్నా ఆ మాటలు పట్టించుకోలేదు. తన రాక కోసం ఒళ్లంతా కళ్లు చేసుకుని తన భార్య— అగ్నిసాక్షిగా పెళ్లిచేసుకున్న భార్య— నిరీక్షిస్తూ ఉంటుంది. నిన్న బజారుకి తీసుకు వెడతానన్నాడు. కాని, తీసుకు వెళ్లలేకపోయాడు. ఈవేళ తప్పదన్నాడు. ఆమె ముస్తాబై సిద్ధంగా ఉంటుంది. తాను ఆలస్యం చేయకూడదనుకున్నాడు.

ఇంటి కింకా బారెడు దూరంలో ఉన్నాడు. వీధి వాకిట్లో ఆమె నిలబడి ఉండటం భానుమూర్తి చూశాడు. ఎందుకలా నించుంది? అనుకున్నాడు. ఎంత సేపటినుంచి నించుందో? తన్ను తాను ప్రశ్నించుకున్నాడు. సమాధానం రాలేదు. అందుకు బదులుగా సందేహం ప్రత్యక్షమయింది. ఒక్క క్షణంలో ఆ సందేహం మొగ్గలు తొడిగింది. అది పిందెలు వేయకముందే అతను ఇల్లు చేరుకున్నాడు.

భర్తను చూసీ చూడటంతోనే ఆమె మెరుపుతీగలా లోపలికి వెళ్లిపోయింది, పైకి పొంగివస్తున్న సంతోషాన్ని కప్పిపుచ్చుకుంటూ. అతను ఆమెను అనుసరించాడు— బద్ధకంగా, నీరసంగా.

ఆమె కాపరానికి వచ్చి ఇంకా పట్టుమని పది రోజులైనా కాలేదు. కాని, ఈ తక్కువ కాలంలోనే వాళ్లిద్దరూ చిలకా గోరింక లనిపించుకున్నారు. దేహాలు వేరయినా, ఆత్మలు ఒక్కటే అని గుసగుస లాడారు ఇరుగు పొరుగు అమ్మలక్కలు.

కాని, ఈ వేళ భానుమూర్తి పెదవుల మీద మందహాసం కనిపించలేదు. మాటల్లో తేనెసోనలు ప్రవహించలేదు. చూపుల్లో ప్రేమవాహిని పొంగలేదు. మరి, మనస్సు. . .

ఆమె నిర్ఘాంతపోయింది.

"ఎందుకండీ ఇలా ఉన్నారు?" అని అడిగే ధైర్యం ఆమె కింకా రాలేదు. అప్పటికే ఆమె అతనివైపు సాభిప్రాయంగా ఒకటి రెండుసార్లు చూసింది. అతను ముభావంగా ఉన్నాడు.

ఇంతలో ఆమె లోపలికి వెళ్లి, ఉప్మా పళ్లెంతో తిరిగి వచ్చి, పళ్లెం అతని ముందుంచింది.

ఉప్మా కొంచెం నోట్లో పెట్టుకుని, "ఇంట్లో ఉప్పు అయిపోయిందా?" అన్నాడు వెటకారంగా.

అతనిలా ఆమె చదువుకోకపోయినా, ఆ వెటకారాన్ని ఆమె గ్రహించక పోలేదు. మొన్న చేసినట్లుగానే, ఈ వేళకూడా ఉప్మా చేసింది. పైగా ఈ వేళ అల్లం ముక్కలు వేసింది; నిమ్మరసం పిండింది. ఆమె కొంచెం రుచి చూసిందికూడా. ఎంతో బాగుంది. తప్పకుండా అతను మెచ్చుకుంటాడని ఆశించింది. అయితే, అతను ఎందు కిలా ప్రవర్తిస్తున్నాడు? ఆలోచనతో మెదడు వేడెక్కింది.

ఆలోచనల డోలికలో ఆమె ఊగుతున్నా, అతను మాత్రం పళ్లెం ఖాళీ చేశాడు, లోలోపల మెచ్చుకుంటూ. మరి కొంచెం అడుగుదా మనుకున్నాడు. కాని, మొదట్లోనే వంక పెట్టినందుకు అడగలేకపోయాడు. ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ఆమెకూడా అడగడం మరిచిపోయింది.

"నువ్వు సిద్ధమైనట్టున్నావు. బజారుకి వెడదామా?" అడిగాడు భానుమూర్తి, లాంఛనప్రాయంగా.

"వద్దు లెండి." ఆమె బదులు చెప్పింది.

ఈ సారి తగ్గిన వాడిలా కనిపించాడు అతను. చదవాలని లేకపోయినా, అలమర లోంచి ఒక పుస్తకం తీసి పుటలు తిప్పడం మొదలుపెట్టాడు.

ఆమె వంటింట్లోకి వెళ్లిపోయింది, తన కంటూ ఒక గది లేకపోవడం వల్ల. చాప పరుచుకుని కూర్చుంది. పెనుగాలికి పైకి లేస్తూ, కింద పడుతూ అల్లల్లాడే ఆకులా, ఆలోచనల గాలిలో ఆమె లేత మనస్సు అటూ ఇటూ కదలసాగింది.

భానుమూర్తి కేమీ తోచలేదు. చదువుతున్నట్టు పట్టుకున్న పుస్తకాన్ని మూసివేశాడు. తన మనస్తత్వం వల్ల అనవసరంగా ఇంట్లో వాతావరణం కలుషితమయినందుకు విచారించాడు.

ఆమె లోపల ఏం చేస్తున్నదో అని తహతహలాడిపోయాడు. వంటింట్లోకి తొంగి చూశాడు.

తల వంచుకుని ఆమె కూర్చుంది. కుడి చేతి వేళ్లతో చాపమీద సున్నాలు చుడుతూంది.

"లలితా!" అన్నాడు భానుమూర్తి.

ఆ పిలుపుకే ఆమె సంతోషించింది. ఎడారిలో నీళ్లు కనిపించినట్టుగా భావించింది. అకాలంలో కోకిల కూత వినిపించినట్టుగా తోచింది. మండుటెండలో నడుస్తున్న బాటసారికి చల్లని నీడ కనిపించినట్టుగా తలచింది.

లలిత భర్తను సమీపించింది. అతను మాట్లాడే లోపల ఆమె— "మీ మౌనం భరించలేను" అంది. ఆమె కళ్లు చెమ్మగిల్లాయి. అతను ఆప్యాయంగా "లలితా!" అనగలిగాడు. అంతకు మించి మరేమీ అనలేకపోయాడు.

భర్త కళ్లలోకి చూస్తూ లలిత అంది: " పక్క భాగం వాళ్లేమో మలయాళీలు. పైన ఏమో బెంగాలీ వారు. వాళ్ల భాష నాకు తెలియదు. నా భాష వాళ్లకు తెలియదు. ఇంక నే నెవరితో మాట్లాడతాను? ఎంతసేపని పత్రికలూ అవీ చదవను?"

"అవును."

"ఈ తిరువనంతపురంలో నా కెవరండీ ఆప్తులుగాని, బంధువులు గానీ... మీ రలా బెల్లం కొట్టిన రాయిలా కూర్చుంటే, నా కష్ట సుఖాలు నే నెవరితో చెప్పుకుంటాను. . ." లలిత ఇక మాట్లాడలేకపోయింది. ఆమె కళ్లు నీటిబుగ్గ లయినాయి.

భానుమూర్తి పశ్చాత్తాపం చెందాడు. అతని నవనీత హృదయం కరిగిపోయింది. "ఈ ఊళ్లో నాకు మాత్రం ఎవరున్నారని— నీకు నేను, నాకు నువ్వు' అంటూ పసిపిల్లవాడిలా బావురుమన్నాడు.

"ఊరుకోండి, ఎవరన్నా చూస్తే . . ." ఆమె తన చీరకొంగుతో అతని కళ్లు తుడిచింది. లోగుండెలలో ఎంతో కష్టం కొద్దీ దాచుకున్న సంతోషాన్ని ఒక్కసారిగా పైకి తెచ్చుకుని చిరునవ్వు నవ్వింది. ఆ చిరునవ్వుతో ఆ గదిలో వెలుగు వెల్లువ ప్రవహించినట్లయింది.

బయటవీధి దీపాలు అప్పుడే వెలిగాయి.

భానుమూర్తి మనస్సు తేలిక పడింది. "అనవసరంగా నిన్ను అపార్థం చేసుకున్నాను, లలితా!" అన్నాడు.

ఆమె ఏమీ చెప్పలేదు. అతని వైపు జాలిగా చూసింది. ఇంకెప్పుడూ అలా అపార్థం చేసుకోవద్దు అన్నట్టుగా ఉంది ఆ జాలి చూపు.

"అలా గుడిదాకా వెళ్లి వద్దాం, లలితా" అంటూ అతను స్నానాల గదికి వెళ్లాడు.

ఆమె పూర్వపు లలిత అయింది.

స్నానం చేస్తున్నంతసేపూ, ఆ తరవాత ఆలయంలో భగవత్సన్నిధానంలో ఉన్నంతసేపూ భానుమూర్తి ఆత్మ విమర్శ చేసుకున్నాడు. 'నేను ఎమ్. ఎ. దాకా చదువుకున్నాను. ఆమె అంతగా చదువుకోలేదు. కాని, ఆమె కున్న సంస్కారం నాకు లేదు. మనిషికి కావలసింది సంస్కారం గాని, డిగ్రీల చదువు కాదు.

సంస్కారం గల ప్రతి భార్యా తన భర్తను ప్రేమిస్తుంది. ఆ ప్రేమను అనవసరమైన సందేహాలతో నేను వమ్ము చేసుకోకూడదు. నేను లలితను పెళ్లి చేసుకున్నది ఆమె ప్రేమను పొందడానికీ, ఆమెను సుఖపెట్టడానికీను . . . స్వామీ! ఎల్లవేళల్లోనూ నా భార్యను ప్రేమించే నిండు మనస్సు నాకు ప్రసాదించు. . .'

ఆ రాత్రి భోజనానంతరం లలిత వంటిల్లు కడుగుతూ ఉంటే, భానుమూర్తి తన పెళ్లి ఫొటోలోని లలితను చూస్తూ, 'లలితా! నన్ను క్షమించు' అన్నాడు. ఆమెతోనే ఆ మాట అనాలనుకున్నాడు మొదట్లో. కాని, అలా అనడానికి సిగ్గు పడ్డాడు. తాను భర్త గదా!

ఆ రాత్రి ఆ ఇంట్లో సంతోషం మెరిసింది. వెన్నెల విరిసింది. అమృతం కురిసింది.

లోకానికి ఆ రోజు అమావాస్య! ఆ దంపతులకు ఆ రోజు పౌర్ణమి! ★

---

## ఆస్తి

తండ్రి తన కొడుకులకు సంపాదించి ఇచ్చే విలువైన ఆస్తి మంచి పేరు. తాత తండ్రుల మంచి పేరు పిల్లలకు సమాజంలో గౌరవం ఇస్తుంది.

—హామిల్టన్

## ధనం విలువ

ఉదార బుద్ధి, పరోపకారం లేనివానికి ఎంత డబ్బు సంక్రమించినా అది పాపంవలె భారమే అవుతుంది. పైగా చివరకు ప్రమాదకరంగా పరిణమించే అవకాశం ఉన్నది

—సిమ్మన్స్